నూతన సంవత్సర శుభాకాంక్షలతో... **ఆరోగ్యమే - మహా భాగ్యం** ప్రొద్దుటూరు డాక్టర్స్ స్పెషల్ ఫీచర్









పసిడిపురిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

- మహానగరాలకు దీటుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు

ప్రొద్దుటూరు : ప్రముఖ వాణిజ్య కేంద్రమైన పసిడిపురి ప్రొద్దుటూరులో ప్రైవేటు ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్య నిపుణులు గతంలో కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే వైద్య సేవలు అందించేవారు. ప్రజల అవసరాల దృష్ట్యా అన్ని విభాగాలను పట్టణంలో విస్తరింపజేశారు. 24 గంటలు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉంటూ పలువురు వైద్య నిపుణులు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆకస్మిక అనారోగ్యం, అత్యవసర ఆరోగ్య సమస్యలకు క్రిటికల్ కేర్ ఆస్పత్రుల్లోని వైద్యులు సేవలు అందిస్తున్నారు. కార్డియాలజీ, గైనకాలజీ, పిడియాట్రిక్, న్యూరో, ఆర్థో, కిడ్నీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కంటి వైద్యం, స్కిన్, డెంటల్, బీపీ, షుగర్ లాంటి అన్ని రకాల వ్యాధులకు ఆయా విభాగాలకు చెందిన వైద్య నిపుణులు సేవలు అందిస్తున్నారు. పురిటి పిల్లలకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. గుండె జబ్బులకు సంబంధించి ఏదైనా సమస్య వస్తే గతంలో తిరుపతి, కర్నూలు, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రొద్దుటూరు పట్టణంలోనే గుండెకు చికిత్స అందిస్తున్నారు. అన్ని రకాల స్త్రీ సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్యాన్ని అందించే ఆస్పత్రులు ప్రొద్దుటూరులో ఉన్నాయి. సంతాన సాఫల్య కేంద్రాలను సైతం ఏర్పాటు చేసి మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ చేయడంతో పాటు తక్కువ వ్యయంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ద్వారా సేవలు అందించడం జరుగుతోంది. 20 నుంచి 50 ఏళ్ల అనుభవం గల వైద్య నిపుణులు ప్రొద్దుటూరులో ఉండటం హర్షించదగ్గ విషయం. ఇక్కడికి ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాతోపాటు రాయలసీమలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా వచ్చి చూపించుకుంటుండటం విశేషం.




















7న మండల సమావేశం

మైదుకూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సభాభవనంలో నిర్వహించే ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు, మండల పరిషత్ సభ్యులు హాజరు కావాలని కోరారు.



భిన్నత్వంలో ఏకత్వంగా అందరినీ కలుపుకెళ్లాలి

ప్రొద్దుటూరు : బీజేపీ నాయకులు భిన్నత్వంలో ఏకత్వంగా అందరినీ కలుపుకెళ్లి పార్టీని పటిష్టం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక గీతాశ్రమంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు టౌన్ -1 అధ్యక్షుడిగా వంకధార నరేంద్రరావు, టౌన్-2 అధ్యక్షుడుగా పాలెం కిరణ్‌కుమార్, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడుగా సుధీర్, రాజుపాళెం మండల అధ్యక్షుడుగా ముళ్ల అస్మిత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో బీజేపీ నాయకులు కుల మత భేదం లేకుండా నిష్పక్షపాత వైఖరితో పార్టీకి వారు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని కార్యవర్గాన్ని నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రియాశీలక సభ్యత్వాల ప్రముఖ్ శ్రీనాథ్‌రెడ్డి, సభ్యత్వాల ఆర్ఓ ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి అరకటవేముల హరినారాయణ, ప్రొద్దుటూరు సభ్యత్వాల ప్రముఖ్ జయలక్ష్మి, అసెంబ్లీ కో కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, గురు ప్రసాద్, రవిశంకర్, రామసుబ్బయ్య, కొండయ్య, సుధాకర్‌రెడ్డి, విక్రాంత్, పృధ్వీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




నూతనంగా ఎన్నికైన బీజేపీ కార్యవర్గం

బద్వేలులో చైన్‌స్నాచింగ్

బద్వేలు అర్బన్ : రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు లాక్కుని పరారైన ఘటన బద్వేలులో చోటు చేసుకుంది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని కోటిరెడ్డినగర్ సమీపంలో గల నారాయణ స్కూల్ వద్ద నివసిస్తుండే సరస్వతి అనే మహిళ కోటిరెడ్డినగర్‌లో తెలిసిన వ్యక్తి మృతి చెందడంతో చూసేందుకు వెళ్లింది. తిరిగి వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును లొక్కుని పరారయ్యారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కొద్ది దూరం దుండగులను వెంబడించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఘటనపై బాధితురాలు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు గాలిస్తున్నారు. అలాగే ఫాతిమానగర్‌లో చిన్నపాటి దుకాణం నిర్వహించుకునే బుజ్జమ్మ అనే మహిళ మెడలో నుంచి కూడా గుర్తు తెలియని వ్యక్తులు గొలుసు లాక్కునేందుకు ప్రయత్నించగా.. ఆమె ప్రతిఘటించడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు.





రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : మండలంలోని రేషన్ షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాయపల్లె ఎస్సీ, గాదెగూడూరులో ఓసీ (మహిళ) ఈడబ్ల్యూఎస్, టంగూటూరు -1 బీసీ-సీ (మహిళ), టంగుటూరు-2 ఓసీ, వెలవలి ఎస్సీ, వాసుదేవపురం ఎస్సీ (మహిళ), కొర్రపాడు బీసీ కాలనీలో ఎస్సీ, పర్లపాడులో ఓసీ, పర్లపాడులో బీసీ-బీ (మహిళ), రాజపాళెంలో ఓసీ (మహిళ) ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ప్రకారం రేషన్ షాపులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన వివరించారు. ఇందుకుగాను ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తులను చేసుకోవాలని, 17న రాత పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.







ఎస్ఐపై దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫిపై దాడి చేసిన ఘటనలో రాజుపాళెం గ్రామానికి చెందిన లింగమయ్య, రాము, నాగయ్యను టూ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ముగ్గురిని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనే ఎస్ఐపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మేకవారిపల్లెలో 'పొలం పిలుస్తోంది'



డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి నాటును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి టి.కౌశిక ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రమ్‌సీడర్ ద్వారా సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారు పెంచడం, నాటు వేయడం అవసరం లేకుండా నేరుగా డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తుకోవచ్చన్నారు. కావున నాటుకు అయ్యే ఖర్చును తగ్గించుకోవడమే కాక అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ పద్ధతిలో ఎకరాకు 10-15 కేజీల విత్తనం అవసరమవుతుందని, నాటు వేసే పద్ధతితో పోలిస్తే ఐదు నుంచి ఏడు రోజులు ముందుగానే వరికోతకు రావడం జరుగుతుందని, రైతుకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.












సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : జనవరి 4, 5 తేదీల్లో సీపీఎం 12వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి భైరవప్రసాద్ పార్టీ శ్రేణులకు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండులోని ఆటో స్టాండులో జెండా ఎగురవేసి ఆయన మాట్లాడారు. 4వ తేదీ జియోన్ కాలేజీ నుంచి ఐటీ సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని, గాంధీ సర్కిల్‌లో బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ సభలకు కార్మికులు, రైతులు, ఉద్యోగులు, సానుభూతి పరులు పాల్గొనాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాలన్నారు. ఉపాధి పథకం పనులు 200 రోజులు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్, సుందరయ్య, గౌసియాబేగం, చిన్నయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.








బురద గుంటలా ఉన్న తిమ్మరాజుపల్లె రోడ్డు

స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు గడిచిపోయాయి. ఎప్పటికప్పుడు ఆధునికత కొత్తపుంతలు తొక్కుతోంది. కానీ బద్వేలు పట్టణానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిమ్మరాజుపల్లె గ్రామానికి జాడ (దారి) లేదు. మామూలు కాలంలో గ్రామ ప్రజలు బయటికి వెళ్లాలంటే గుంతల రహదారిలో కుప్పిగంతులు వేయాల్సిందే. వర్షాకాలంలో జ్వరమొచ్చినా.. ప్రాణం పోయే రోగం మొచ్చినా ఇంట్లో నుంచి అడుగుతీసి బయటపెట్టలేని పరిస్థితి. సూది మందుకు.. మందు బిల్లకు దిక్కులేదు. దైవం మీద భారం వేసి దుప్పటి కప్పకుని ముసుగేసి మంచం మీద పడుకోవాల్సిందే. గ్రామానికి బస్సులేదు. ఆటోలు అసలు రావు. ఆటో ఎక్కాలంటే 2 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే. అభివృద్ధి అంటే తెలియని తిమ్మరాజుపల్లె గ్రామ ప్రజల వ్యథ ఇది.

తిమ్మరాజుపల్లెకు
రహదారేది?


నీళ్లలో నడిచి వెళ్తున్న గ్రామస్తులు

- కాలుమోపితే జర్రున జారుడే
- విద్య, వైద్యానికి దూరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బద్వేలు : బద్వేలు పట్టణానికి నాలుగు కిలో మీటర్లు ఉంటుంది తిమ్మరాజుపల్లె అనే గ్రామం. 120 కుటుంబాలు 400 మంది ప్రజలు నివసిస్తున్నారు. గూడెం గ్రామం నుంచి తిమ్మరాజుపల్లెకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు కిలోమీటర్ల దూరమే ఆ గ్రామం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. దారి పొడవునా ఎగుడు దిగుడుగుంతలు. వర్షం వస్తే కాలుమోపితే జర్రున జారుడే. అడుగులో అడుగేసుకుంటూ రెండు కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు పడుతోంది.

ఊరి నిండా మురుగే

ఊర్లో అక్కడక్కడ సిమెంటు రోడ్లు ఉన్నా డ్రైనేజీ వ్యవస్థ లేదు. వర్షం నీళ్లు, కొళాయిల నుంచి వచ్చే వృథా నీరంతా ఇళ్ల మధ్యకు చేరి మురుగు కూపంగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఊరు చుట్టూ పొలాలే. ఫలితంగా దోమలు విజృంభించి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో రోగాలొస్తే ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కాస్త కళ్లు తెరిచి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడితే మా బతుకులు బాగుపడతాయంటున్నారు తిమ్మరాజుపల్లె ప్రజలు.

విద్య, వైద్యం దూరం

గ్రామంలో రోగాలొస్తే వైద్యం లేదు. చదువు కునేందుకు విద్య లేదు. వైద్యం, చదువు ఈ రెండు కావాలంటే బద్వేలు వెళ్లాల్సిందే. రహదారి లేకపోవడంతో ఇప్పటికే 20 కుటుంబాల వారు పిల్లల చదువు కోసం, వైద్యం కోసం గ్రామాన్ని వదిలేసి పట్టణానికి వెళ్లిపోయారు.

దారి బాగు చేయండి



మా ఊరి దారి బాగుచేస్తే చాలు. పిల్లలు చదువులకు, రోగాలొస్తే వైద్యానికి పట్టణానికి వెళ్లాలంటే కష్టంగా ఉంది. 50 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి. ఈ కష్టాలు భరించే ఓపిక మాకు లేదయ్యా.

– సుదర్శన్‌రాజు, రిటైర్డు ఉద్యోగి, తిమ్మరాజుపల్లె

గ్రామం వైపు కన్నెతి చూడలేదు



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రోడ్డు బాగు చేస్తామన్నారు. ఇప్పటికి గ్రామంలో అడుగు పెట్టిన నాయకులు, అధికారులు లేరు. ఓట్ల కోసం వచ్చి పోయారు. ఆ తరువాత ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు.

– సుబ్రమణ్యంరాజు, రైతు, తిమ్మరాజుపల్లె

రోడ్డు మంజూరు చేస్తాం



గూడెం నుంచి తిమ్మరాజుపల్లె రోడ్డు సరిగా లేని విషయం నా దృష్టికి వచ్చింది. అయితే అప్పటికే ఎన్‌ఆర్‌జీఎస్ కింద మంజూరైన నిధులు ఇతర గ్రామాల్లో రోడ్లకు కేటాయించాం. మలివిడతలో తిమ్మరాజుపల్లె గ్రామానికి నిధులు మంజూరు చేసి రోడ్డు బాగు చేయిస్తాం.

– ఎం.మల్లేశ్వరి, మండల అభివృద్ధి అధికారి, బద్వేలు మండలం

నూతన సంవత్సర శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ గోవిందరెడ్డి


ఎమ్మెల్యే డాక్టరు సుధా


విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల/అట్లూరు : నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా, బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు కన్వీనర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వారు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ 2025లో దైవానుగ్రహం సంపూర్ణంగా ఉండాలని పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్, కొత్త అవకాశాలు అన్వేషించడానికి, నూతన లక్ష్యాలు సాధించడానికి కొత్త సంవత్సరం ప్రేరణ ఇస్తుందన్నారు. అందరూ బాధ్యతతో వ్యవహరించినపుడే మెరుగైన సమాజం సాధ్యమవుతుందన్నారు.

సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

కడప కల్చరల్ : 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కడప నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా శుభాకాంక్షలు తెలిపారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి


శంఖారావం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : జనవరి 5న తలపెట్టిన హైందవ శంఖారావంను జయప్రదం చేయాలని వీహెచ్‌పీ, ధర్మవీర్ సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హైందవ శంఖారావం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు ఫణిరావు, ధర్మవీర్ కశ్యప, ధర్మవీర్ రాఘవేంద్ర మాట్లాడుతూ దేవాలయాల ఆస్తులను ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి బయటకు తెచ్చేందుకు జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం ర్యాలీ, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి హిందూబంధువులందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలరంగయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పోరుమామిళ్ల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ బాల అంకిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏపీటీఎఫ్ 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు సత్తార్, సురేంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శేషారెడ్డి, భూపాలరెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, అన్వర్‌బాష, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉట్టి కొడుతున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి


యువతుల సందడి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సందడిగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయంలోని గురుకులం ప్రాంగణంలో వాణిజ్య శాస్త్ర ఆచార్యులు డాక్టర్ జి. విజయభారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రీతికరమైన పండగ అన్నారు. సంక్రాంతి రైతుల పండుగని, సంక్రాంతి నాటికి రైతులు పండించే నవధాన్యాలు ఇంటికి చేరుతాయన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు ఉట్టి కొట్టడంలో పోటీ పడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా గాలిపటాలను వదిలారు. విద్యార్థినులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచారు. సంప్రదాయ కోలాటం, హరిదాసు సంకీర్తనలతో సంబరాలు కన్నుల పండగగా సాగాయి. పిల్లలను ఆశీర్వదించడం, భోగి మంటలు, సంక్రాంతి లక్ష్మీకి పూజచేసి పండగను ఆహ్వానించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకలు

కడప కల్చరల్ : కడప నగరంలోని ప్రముఖ ఆలయాలలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అలంకారాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. నూతన సంవత్సరాన్ని దైవ దర్శనంతో ప్రారంభిస్తే ఆ సంవత్సరమంతా సుఖ సంతోషాలతో ఉండవచ్చన్న భావన పలువురు భక్తుల్లో ఉంది. ఇందుకు అనుగుణంగా దేవాలయాల నిర్వాహకులు జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల దర్శనాలకై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని మరి

దేవునికడప: శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న దేవునికడపలో నూతన సంవత్సర సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు దేవతామూర్తుల సులభ దర్శనమయ్యేలా క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ఉదయం 5 గంటల నుంచి దేవతా మూర్తులకు అభిషేకాలు, అలంకారాలు ప్రారంభమవుతాయి. దేవుని కడపతోపాటు జిల్లాలో తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాలలో దర్శనాలుటాయి.

విజయదుర్గాదేవి ఆలయం : కడప నగరం బిల్టప్ వద్ద గల విజయదుర్గాదేవి ఆలయంలో కూడా నూతన సంవత్సరం సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు సుధా మల్లికార్జున రావు, దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే అమ్మవారి దర్శనాలకు భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా నూర్పిళ్లు


రాజుపాళెంలో వరి పంటను యంత్రంతో నూర్పిళ్లు చేస్తున్న రైతులు


పగిడాల వద్ద పొలంలో కోత కోసిన వరి పంట


వరి ధాన్యం

కేసీ చాపాడు కాలువ కింద రైతులు సాగు చేసిన వరి పంటను ప్రస్తుతం నూర్పిళ్లు చేస్తున్నారు. అకాల వర్షాలతో వరి పంటలో తేమ శాతం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడకుండా ఉండి ఉంటే తక్కువ ఖర్చుతో నూర్పిళ్లు పూర్తయ్యేవని, వర్షాలు పడటం వల్ల అదనంగా ఎకరాకు రూ.1000 నుంచి రూ.1500 భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యం ఎకరాకు 25 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుందని తెలిపారు. బస్తా (75 కేజీలు) రూ.1200 నుంచి రూ.1500 పలుకుతోందని, ఈ ధరకు అమ్ముకుంటే నష్టాలే మిగులుతాయని చెబుతున్నారు. – రాజుపాళెం

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు : రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని స్త్రీ శక్తి భవనం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని రైతుల భూ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని, ఎలాంటి భూ సమస్యలు ఉన్నా తమకు ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, రీసర్వే డీటీ నారాయణస్వామి, సర్వేయర్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మహబూబ్ బీ, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, బయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాకు తెలియకుండా పింఛన్లు ఎలా పంపిణీ చేస్తారు?

మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : తనకు తెలియకుండా మున్సిపాలిటీలో పింఛన్లు ఎలా పంపిణీ చేస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ప్రశ్నించారు. ఆమె మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి భర్త మరణించిన వారి స్థానంలో వారి భార్యలకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయంలో పంపిణీ చేయడం ఏమిటని అన్నారు. దీనికి సమాధానం చెప్పాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ ఇచ్చినట్లు తెలిపారు. కనీసం ప్రొటోకాల్ పాటించాలనే విషయం తెలియకపోతే ఎలా అన్నారు. మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా మాట్లాడుతూ టీడీపీ నాయకులు కొత్త పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చింది కొత్త పింఛన్లు కాదని, భర్త మరణించిన వారి స్థానంలో భార్యలకు మాత్రమే ఇచ్చారన్నారు. అర్హత ప్రకారం కొత్త పింఛన్లు మంజూరు చేస్తే మున్సిపాలిటీలో కొత్తగా 5 వేల పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం 15 పింఛన్లు మాత్రమే మంజూరయ్యాయన్నారు. పైగా కేవలం గత నవంబర్ నెలకు సంబంధించి మాత్రమే ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎంపిక చేస్తే ఈ సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. పాతికేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న, రెండు మార్లు ప్రతిపక్షంలో ఉన్న వరదరాజులరెడ్డి ప్రభుత్వ కార్యాలయంలో కాకుండా తన కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి అంతటికీ భర్త మరణిస్తే భార్యకు ఇచ్చే పింఛన్లు కేవలం 37 మాత్రమే అన్నారు. దీనిని 3,700 పింఛన్లు ఇచ్చినట్లు టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కొత్త పింఛన్ల నమోదుకు ఎందుకు ప్రభుత్వం ఇంత వరకు ఆప్షన్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చెప్పిన మాటలను చూసి పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారంతా సచివాలయాల వద్దకు వస్తున్నారని అన్నారు. కేవలం సీఎం చంద్రబాబు మాత్రమే అబద్ధాలు చెబుతారని అనుకున్నామని, అదే రీతిలో ఇప్పుడు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా అబద్ధాలు చెబుతున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీకి సంబంధించి 16 వేల పింఛన్లు ఉండగా ఇప్పుడు వాటిని 14,870కి తగ్గించారన్నారు. కనీసం తగ్గిపోయిన వాటి స్థానంలో కొత్తవి భర్తీ చేసినా పేదలకు మేలు జరిగే అవకాశం ఉండేదన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వార్శల గురునాథరెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు లేఖ

మున్సిపాలిటీకి సంబంధించి ప్రొటోకాల్‌ను విస్మరించొద్దని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు లేఖ ఇచ్చారు. తనకు తెలియకుండా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆయన కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారన్నారు. మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడలని కమిషనర్‌కు చైర్‌పర్సన్ తెలిపారు. చైర్‌పర్సన్ వెంట వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చారి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చారి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటోందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ విద్య, నాణ్యమైన భోజనం అందే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, కౌశిక్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో..వరి సాగు



చాపాడులో వరి నాట్లు వేస్తున్న కూలీలు




సాగు చేసిన వరి నారుమడి

గత ఏడాది ఖరీఫ్‌లో కేసీ కెనాల్ ఆయకట్టు, బోరుబావుల కింద ఎన్నో ఆశలతో వరి సాగు చేసుకున్న రైతులకు పంట చేతికందాక గిట్టుబాటు ధరలు లేక చేదు అనుభవం ఎదురైంది. కొత్త ఏడాదిలోనైనా మేలు జరుగుతుందనే ఆశతో చాపాడు మండలంలో రైతులు రెండో కారు వరి సాగు చేస్తున్నారు. చాపాడు, అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రామదాసుపురం ఇంకా పలు గ్రామాలలో బోరుబావుల కింద ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేశారు. కొన్ని చోట్ల వరి నాట్లు వేస్తుండగా మరి కొన్ని చోట్ల వరి నాటేందుకు సమాయత్తమవుతున్నారు. 2025 కొత్త ఏడాదిలోనైనా సరైన గిట్టుబాటు ధరలు ఉంటాయని ఆశతో రెండో కారు వరి సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. – చాపాడు

కుందూనదిలో వృద్ధుడి గల్లంతు

– మూడు రోజులుగా పోలీసుల గాలింపు చర్యలు

చాపాడు : మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సుబ్బరాయుడు(70) అనే వృద్ధుడు మూడు రోజుల క్రితం గ్రామ సమీపంలోని కుందూనదిలో గల్లంతు అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకూ.. గుంతచీపాడుకు చెందిన తమ్మిశెట్టి సుబ్బరాయుడు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేని కారణంగా గ్రామంలో కలియతిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కుందూనది సమీపంలో తిరుగుతూ ఉండగా ఒక్కసారిగా నందిలో గల్లంతయ్యాడు. వృద్ధుడు నదిలో గల్లంతైన విషయాన్ని గమనించిన గుంతచీపాడుకు చెందిన కూలీలు గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఫిర్యాదు మేరకు చాపాడు పోలీసులు ఖాదరపల్లెకు చెందిన గజ ఈతగాళ్లతో కుందూనదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గత మూడు రోజులుగా గాలిస్తున్నప్పటికీ సుబ్బరాయుడు ఆచూకీ తెలియలేదని చాపాడు పోలీసులు తెలిపారు.



నదిలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు, గజ ఈతగాళ్లు

● విద్యుత్ లైన్ మార్పు



ఇళ్ల పైన మనిషి ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు (నాడు)



ఇళ్ల పైన తొలగించిన విద్యుత్ లైన్ (నేడు)

బి.కోడూరు : గత కొంత కాలంగా మండలంలోని సిద్దుగారిపల్లె ఎస్సీ కాలనీలో కాలనీపైన అడ్డుగా వెళుతున్న 11 కె.వి.విద్యుత్ వైర్ల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం సాక్షి దినపత్రికలో 'ప్రమాదాలు జరిగేంత వరకు పట్టించుకోరా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన విద్యుత్‌శాఖ ఏడీఈ రవిచంద్ర, ఏఈ సుబ్బరాయుడు.. కాలనీలో అడ్డుగా వెళుతున్న విద్యుత్ లైన్‌ను మార్చి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించారు. త్వరితగతిన పరిష్కరించిన ఏడీఈ, ఏఈలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఈ రవిచంద్ర మాట్లాడుతూ ప్రభలవీడు వద్ద గల పొలంలో గల అస్తవ్యస్తంగా ఉన్న 11 కె.వి. విద్యుత్ వైర్లను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సేంద్రియ పంటల దిగుబడికి అధిక ధర



వరి ధాన్యం నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

అట్లూరు : సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యాన్ని అధిక ధరతో అమ్ముకోవచ్చని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతి ద్వారా అట్లూరు మండలంలోని కమలకూరు, గోపవరం మండలం కాలవపల్లి, సిద్దవటం మండలం లింగంపల్లి, బద్వేలు మండలం బయనపల్లి గ్రామాలలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సేకరించారు. శాస్త్రీయ పద్ధతిలో నమూనాలను నాణ్యత పరీక్ష నిమిత్తం ఆధీకృత సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గానిక్ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ప్రతినిధి సునీల్‌కుమార్‌రెడ్డి, సంబంధిత మండల వ్యవసాయ అధికారి సమక్షంలో మంగళవారం సేకరించారు. ఈ నమూనాలపై బెంగళూరులోని నాణ్యత పరీక్షా కేంద్రంలో విష పురుగుల మందుల అవశేషాలను గుర్తిస్తారన్నారు. పురుగుమందుల అవశేషాలు లేనట్లయితే సంబంధిత రైతులకు స్కోప్ సర్టిఫికెట్స్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఆయా రైతులు అధిక ధరకు అమ్ముకొనుటకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు అనూష, సుబ్బయ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువర్ధన్ అనే 14 ఏళ్ల విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి పేటకు చెందిన పోతురాజు గోవర్ధన్ అనే విద్యార్థి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల సమయం అయిపోగానే సైకిల్‌పై గ్రామానికి బయల్దేరాడు. పట్టణ శివారులోని మేధా డిఫెన్స్ అకాడమీ సమీపంలో ఎదురుగా వస్తున్న ప్రొద్దుటూరు డిపోకు చెందిన తిరుపతి ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు కింద పడ్డాడు. సంఘటనలో విద్యార్థి కుడికాలు ఎముకలు కనిపించేలా ఛిద్రమైంది. ఆ సమయంలో అటుగా వెళుతున్న ప్రైవేట్ వాహనంలో విద్యార్థిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయం తీవ్రమైనది కావడంతో ఆస్పత్రి వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటనపై పోలీసులు ఆర్టీసీ బస్సు సిబ్బందిని విచారణ చేస్తున్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణా శిబిరం

కడప కల్చరల్: కడప నగరం పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం నుంచి ప్రారంభించ నున్నామని సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, అధిక బీపీ, డయాబెటీస్, అస్తమా, గ్యాస్ట్రబుల్, ఒబెసిటీ, థైరాయిడ్ సమస్యల నివారణకు అవసరమయ్యే యోగాసనాలు, ప్రాణయామం, సూర్య నమస్కారాలు, షట్‌క్రియలు, ధ్యానం లాంటి యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటలకు మరొక బ్యాచ్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98488 61206 లేదా 70132 38986 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కడప అగ్రికల్చర్: రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటి నేచురల్ ఫామింగ్ సిబ్బంది ప్రకృతి వ్యవసాయాన్ని చేయించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. రైతు సాధికార సంస్థ సౌజన్యంతో కడప ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో 36 మండలాల ఎన్‌ఎఫ్ ఏలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. డిజిటల్ మెలకువలపై శిక్షణ ఇవ్వడమేగాక, పంటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, జీవ ఉత్ప్రేరకాలు, మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధాన్యం, మార్కెటింగ్ అనుసంధానం, ధర అంశాల గురించి అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా చెన్నూరు, కొండపేటను విజిట్ చేశారు. సుధాకర్‌రెడ్డి అనే రైతుకు జీవామృతం తయారీ, వరిలో గట్టుపై బంతి, వంగ, టమోట, మిరప నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నయా సాల్...2025 సంబరం


విక్రయానికి బొకెలు సిద్ధం


అందమైన ప్యాకింగ్‌లో చాక్లెట్లు


డైరీలు కొంటున్నమహిళ

కడప కల్చరల్: కొత్త సంవత్సరం అనగానే ఉత్సాహం, ఆనందం వెల్లువెత్తుతాయి. వృద్ధులు సైతం యవ్వనంలోకి వచ్చినట్లు ఆనందించే సమయం న్యూ ఇయర్. నూతన సంవత్సరం ముందు రోజు ఆర్ధరాత్రి నుంచి యువత జోష్‌లో మునిగి తేలింది. కొద్ది క్షణాలే అయినా తమ అభిమానాన్ని తమకు ఇష్టమైన వారితో పంచుకునేందుకు కొత్తదారులు అన్వేషించారు.

బొకె...ఓకే... : కొందరు బొకెలు ఇచ్చేందుకు ఇష్టపడ్డారు. కళ్లు చెదిరే రంగురంగుల పూలన్నీ ఒకే బొకెలో బొద్దుగా, ముద్దుగా సర్దుకుని కూర్చోవడం, పచ్చని ఆకుల మధ్య చలికి నులివెచ్చని ఆనందం అనుభవిస్తూ పలుకరించే పూలను ఇందుకోసం దుకాణదారులు సిద్ధం చేయడంతో వాటిని కొనేందుకు ఎగబడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి మెటీరియల్ తెప్పించి సరికొత్త ఆకర్షణ, డిజైన్లతో ఫొటోలను చేర్చి బొకెలు తయారుచేశారు. తట్టలు, బుట్టలు, పిచ్చిక గూళ్లు, పంజరాల్లాంటి ఆకారాల్లో పూలు సర్ది ఆకర్షించేలా అందుబాటులో ఉంచారు.

ఆకర్షించేలా కేక్‌లు..: అందమైన అమ్మాయిలా ఆకర్షిస్తున్న యువతి బొమ్మ యువతకు, పిల్లలకు కేక పెట్టిస్తోంది. ఒకింత ధర పెరిగినా కొనేందుకు డిసెంబరు 31 మధ్యాహ్నం నుంచే జనాలు ఎగబడ్డారు. కేకులు అమ్మేందుకు ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. కార్పొరేట్ స్టైల్‌లోని కేకు దుకాణాలకు మంచి డిమాండ్ ఉండగా, చిన్న దుకాణాలు వ్యాపారంలో పోటీ పడుతున్నాయి. కిలో రూ.350గా ఉన్నా ఇచ్చిన వారికి ఆనందం, తిన్నవారికి తియ్యదనం లభిస్తాయి గనుక వీటికి మంచి ఆదరణ ఉంటోంది.

డైలీ...డైయిరీ: కొత్త సంవత్సర కానుకగా డైరీల వ్యాపారం మళ్లీ పుంజుకున్నది. రోజువారి విశేషాలను రాసుకునేందుకు అందంగా డైరీని రూపొందించడంతోపాటు గడియారాలు, క్యాలిక్యులేటర్లు అమర్చి అందుబాటులో ఉంచుతున్నారు. హుందా ఉండే పెద్దలు, అధికారులకు ఈ డైరీలను అందించి తమ అభిమానాన్ని చాటుకుంటూ పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

స్వీట్లు–చాక్లెట్లు : యువత మోజు స్వీట్లపైనే కనిపిస్తోంది. నూతన సంవత్సరం కోసం సాధారణ స్వీట్లతోపాటు వ్యాపారులు ప్రత్యేకమైన, ఆకర్షణీయమైన ప్యాకింగ్ టిన్‌లతో చాకెట్లను అందుబాటులో ఉంచారు. 5-10 చాకెట్లు ఉన్న ఒక్కొక్క టిన్ రూ. 200-500 వరకు ఉంది. యువత వీటిని స్నేహితులకు ఇచ్చేందుకు కొనుగోలు చేస్తోంది. మొత్తంపై కానుకలిచ్చి పుచ్చుకోవడంలో అన్ని వర్గాల ప్రజలు తమదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. కొత్త సంవత్సరాన్ని కొత్తదనంతో కొత్త ఆనందాలతో నిర్వహించుకుంటున్నారు.

మద్య రహిత వేడుకలు చేసుకుందాం

కడప కల్చరల్ : మద్యానికి ప్రాధాన్యత లేని నూతన సంవత్సర వేడుకలను చేసుకుందామని జన విజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖర్ రాహుల్, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానికేతన్ పాఠశాల నుంచి కొత్త సంవత్సరం మద్యం లేకుండా గడిపి కుటుంబమంతా ఆనందంగా ఉండాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం శుభాలను అందిస్తుందని ఆశించడంలో తప్పులేదుగానీ, అల్లరి, అరుపులు, కేకలు మద్యంతో ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడంమంచిది కాదన్నారు. కొత్త సంవత్సరంలో కుటుంబ సభ్యులు గర్వపడేలాగడపాలని సూచించారు. డిసెంబరు 31న చేసే ఖర్చును బిడ్డల చదువుల కోసం ఖర్చు పెట్టేందుకు ఉపయోగించాలని సూచించారు. మధుసూదన్, ఉపాధ్యాయులు సువర్ణలత, సుష్మ, వెంకటసుబ్బయ్య, గౌతమి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ఎంపిక

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) పరీక్షల విభాగం డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్‌గా డాక్టర్ ఆర్.నీలయ్య నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మంగళవారం అందజేశారు. నూతన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్‌గా నియమితులైన డాక్టర్ ఆర్.నీలయ్య 2026 డిసెంబర్, 31వతేదీ వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డా.రామకృష్ణ, డా.సురేష్‌బాబు, డా.శివరామ్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగం


విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు సైన్సుపై ఆసక్తి, ప్రతిభ చాటడానికి వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని డీఈఓ మీనాక్షి పేర్కొన్నారు. కడప బిల్టప్ సర్కిల్‌లోని దారుస్సలాం ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన సైన్సు ఫెయిర్ కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను డీఈఓతోపాటు జిల్లా సైన్సు అధికారి ఎబినైజర్ ఇమాన్యుయేల్ పరిశీలించారు.

ప్రభుత్వ బాలుర గృహం పరిశీలన


కడపలో ప్రభుత్వబాలుర గృహంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తన సిబ్బందితో కలిసి కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని మంగళవారం పరిశీలించారు. పిల్లలు ఏఏ తరగతులు అభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక పథకం-2024 వివరించారు. లీగల్ సెల్ఫ్స్ హెల్ప్‌లైన్ 15100, చైల్డ్ లైన్ నెంబర్ 1098 తెలియజేశారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించారు. సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికారసంస్థ వారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం సూపరింటెండెంట్ వీరయ్య, వైద్యాధికారి, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఉన్నత విద్యలో చేసిన సేవలు ప్రశంసనీయం


ఆర్‌జేడీ దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

వైవీయూ: ఉన్నత విద్యలో డేవిడ్ కుమారస్వామి సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాపాక డేవిడ్ కుమారస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమం నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషాలు డాక్టర్ డేవిడ్ కుమారస్వామి ఉన్నత విద్యలో చేసిన సేవలను కొనియాడారు. కుమార్‌స్వామి మాట్లాడుతూ తాను విధి నిర్వహణలో 14 మంది ఐఏఎస్ అధికారులతో కలిసి పనిచేసే అవకాశం లభించిందన్నారు. అనంతరం డా.రాపాక డేవిడ్ కుమారస్వామి దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.పద్మశ్రీ,, ప్రిన్సిపల్ డా.రవికుమార్, విశ్రాంత ప్రిన్సిపల్ డా.పి.సుబ్బలక్షుమ్మ, రమణ, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

జనవరి 6న కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి.బాదుల్లా, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లింగన్న విజ్ఞప్తి చేశారు. నగరంలోని రవీంద్రనగర్‌లో భవన నిర్మాణ కార్మికుల గోడపత్రాలు మంగళవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తొలి సంతకం పెడదామని, ఆరు మాసాలు గడచిపోతున్నా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహ బహుమతి, మెటర్నిటీ బెనిఫిట్, ప్రాణాంతక యాక్సిడెంట్, వైకల్యం, నేచురల్‌డెత్, హాస్పిటలైజేషన్, అంత్యక్రియల ఖర్చులు, పెన్షన్ స్కీమ్ జగన్ ప్రభుత్వ హయాంలో అటకెక్కాయన్నారు. సిమెంట్, ఇసుక, ఇటుక, కంకర, ఐరన్, గ్రావెల్, కలప, ఎలక్ట్రికల్ సామగ్రి ఇలా అన్ని రేట్లు ఆకాశాన్నంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, బుజ్జి ,రాముడు, మల్లేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఇలియాస్‌ఖాన్ మృతిపై విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న ఇలియాస్‌ఖాన్ మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. కడప కోటిరెడ్డి సర్కిల్‌లో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఏలో అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఇలియాస్ ఖాన్‌ను డీఈఓ తిట్టడంతోపాటు మానసికంగా వేధించడంతోనే ఆయన మృతి చెందాడని ఆరోపించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను దూర్భాషలాడుతూ సస్పెండ్ చేస్తానంటూ బెదిరిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

కడపలో బారికేడ్లు ఏర్పాటు


బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

కడప అర్బన్: కడప నగరంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకునే సందర్భంలో వాహనదారుల స్పీడ్‌కు బ్ర వేసేందుకు పోలీసులు తమ వంతుగా కృషి చేస్తున్నారు. ప్రజల భద్రత, పరిరక్షణల కోసం ప్రధానంగా రాజారెడ్డి వీధిలో, ఇంకా పలు చోట్ల పోలీసులు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు, కడప ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణలతో పాటు పోలీసు సిబ్బంది బారికేడ్లను ఏర్పాటు చేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

సంస్కృతికి నిలువెత్తు రూపం బుడ్డా వెంగళరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఆకలిగొన్న వారిని అక్కున చేర్చుకుని అన్నం పెట్టి ఆదరించే రాయల సీమ సంస్కృతికి నిలువెత్తు ప్రతిరూపం ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి అని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బుడ్డా వెంగళరెడ్డి 123వ వర్ధంతి జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కలియుగ దాన కర్ణుడిగా ప్రసిద్ధి గాంచిన వెంగళరెడ్డికి తెలుగు రాష్ట్రాల్లో మరొకరు సాటిరారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. డొక్కల కరువులో ఆకలి బాధ భరించలేక రాయలసీమలో వేలాదిగా మృత్యువాతపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి, ఓరుగంటి నాగేంద్రబాబు, గొబ్బూరి కోటేశ్వరరావు, పలువురు జర్నలిస్టులు పాల్గొని వెంగళరెడ్డికి నివాళులర్పించారు.

అధ్యాపకుల వేతనాల వెతలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో పనిచేస్తున్న అధ్యాపకులకు (అకడమిక్ కన్సల్టెంట్లు) వేతనాల వెతలు తప్పడం లేదు. ఓ వైపు ప్రభుత్వం 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు ఇస్తామంటూ ఏకంగా మేనిఫెస్టోలో సైతం ఉంచారు. అయితే అందుకు భిన్నంగా రెండు నెలలుగా అకడమిక్ కన్సల్టెంట్లకు వేతనాలు రాకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో అకడమిక్ కన్సల్టెంట్ల వేతనాలను పెంచేందుకు ప్రభుత్వం జారీ చేసిన 110 జీఓ ఉత్తర్వులను అన్వయించుకుని, అర్హతలు కలిగిన వారికి పెంచే దిశగా అడుగులు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని కొనసాగింపు దిశగా ఓ కమిటీని వేసింది. కమిటీ సభ్యులు సైతం పలు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. దీంతో అర్హతలు కలిగిన అధ్యాపకులతో పాటు అందరికీ ఎంతో కొంత వేతనం పెరుగుతుందని భావించారు. నవంబర్ నెల వేతనం ఆలస్యం కావడంతో పెరిగిన వేతనంతో కలిపి వస్తుందని ఆశించారు. అయితే ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో ముందుకు వెళ్లొద్దన్నారంటూ వేతనాల పెంపు ప్రక్రియను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో ఆ నెల వేతనం పెరగక పోగా, రావాల్సిన వేతనం కూడా రాలేదు. తాజాగా డిసెంబర్ నెల వేతనంకు సంబంధించి శాలరీ బిల్లులను అప్‌లోడ్ చేసే క్రమంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పాటు రిజిస్ట్రార్ సెలవులో వెల్లడంతో ఈ నెలకు సంబంధించిన శాలరీబిల్ కూడా అప్‌లోడ్ కాని పరిస్థితి నెలకొంది. దీంతో వరుసగా రెండో నెల వేతనం వచ్చే పరిస్థితి లేకపోకపోవడంతో అకడమిక్ కన్సల్టెంట్‌లలో ఆందోళన నెలకొంది.

దుర్గమ్మా...కాపాడు తల్లీ


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విదానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.